

# అమెరికలకలం' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు



5

# తానా "క.కా" వికాకులం కథ

ఇటీవల జూన్ 24-25-26 తేదీలలో డాలస్ లో జరిగిన 19 వ తానా మహాసభలకి వెళ్లి, మళ్లీ హ్యూస్టన్ వచ్చి పడ్డాను.. ఆ పెద్ద కన్వెన్షన్ సెంటర్ లో మైళ్ళ కొద్దీ నడవ లేక నాదీ, ఇతర పెద్దలదీ సగటు కొలెస్ట్రాల్ యాభై పాయింట్లు పడిపోయింది. కానీ బీపీ, సుగరూ పెరిగిపోయాయి. మా క్వీన్ విక్టోరియా కూడా ఈ సభలకి వస్తానని ముందు బెదిరించింది కానీ ఎందుకైనా మంచిదని ఆఖరి క్షణంలో విరమించుకుంది. పైగా "నువ్వు వెళ్ళకపోతే అక్కడ నిన్ను ఎవరూ మిస్ అవరు" అని కూడా ఆవిడ నాకు సలహా ఇచ్చింది. మా క్వీన్ విక్టోరియా కూడా గమనించిన విషయం ఏమిటంటే ఇటీవలి కాలంలో నేను "కలుపుకోవలసిన వాడు" అనే స్థాయి నుంచి "వెలి వేయవలసిన వాడు" అని ప్రమోషన్ వచ్చింది కాబట్టి నాకు తానాలో గౌరవ మర్యాదలు నామ మాత్రంగానే మిగిలాయి. కాబట్టి నేను అక్కడ చేసేదేమీ ఎలాగా లేదు. ఉత్తినే వరండాలలో తిరుగుతూ పలకరింతలకీ, కొండొకచో కావలింతలకీ (అనగా కేవలం చిన్న చిన్న హగ్గులనమాట..) డబ్బు తగలేసుకోవడం ఎందుకూ అని ముందు ఈ తానా సభలకి వెళ్ళదల్చుకో లేదు. కానీ తానా అధ్యక్షుడు గారు నాకు మరీ, మరీ ఆత్మీయుడు కాబట్టీ, డాలస్ సాహితీ మిత్రులందరూ నేనంటే గౌరవంగా ఉంటారు కాబట్టీ పోనీ ఈ ఒక్క సారికి వెళ్తే పోలే అనుకున్నాను. పైగా నాకు మంచి కంపెనీ ఉంది. అందు చేత నేనూ గొల్లపూడి గారూ, ఆయన శ్రీమతి శివానీ గారూ కలిసి కార్లో కబుర్లు చెప్పుకుంటూ ముందు రోజే హ్యూస్టన్ నుంచి డాలస్ వెళ్ళాం.

సాధారణంగా వీలయితే ఫ్రీగానో, కనీసం ఎంత తక్కువ ఖర్చుతో లోపలికి దూరిపోదామా అని ఆలోచించే నేను ఈ సారి అనుకోకుండా, ఒకానొక బలహీన క్షణంలో పెద్ద పోటు గాడి లాగా వెయ్యి డాలర్లు కమిట్ అయిపోయాను. ఎందుకంటే పైన ఉదాహరించిన సదరు తానా అధ్యక్షులైన పెద్ద మనిషి --.ఆయన పెద్ద మనిషి అవడానికి ఆయన ఆరడుగుల ఎత్తు కూడా ఒక కారణం -- నెల క్రితం మందీ మార్బలంతో విరాళాలు పోగెయ్యడానికి హ్యూస్టన్ వచ్చి, నలుగుర్లోనూ నన్ను నిలబెట్టి "ఇస్తావా, చస్తావా?"

అని అందరికీ వినపడకుండా బాడీ లాంగ్వేజీ ద్వారా నాకు ఇండియాలో SMS , అమెరికాలో Text అనబడే మెసేజ్ పంపించాడు. ఇప్పుడప్పుడే చచ్చుట, అందునా ఆ విదముగా చచ్చుట ఏ మాత్రం ఇష్టం లేక, ఈ విషయం తెలిసిన యడల మా క్వీన్ విక్టోరియా చేతులలో చచ్చుట తథ్యము సుమతీ అని తెలిసినా అక్షరాలా నా బెటర్ హాఫ్ చేతులలో చచ్చుట సతీ సహగమనం తో సమానమైన పుణ్యం కదా, పరవా లేదులే అని "సహస్ర డాలర్" డోనర్ కేటగిరీకి నిండు సభలో వాగ్దానం చేసాను. ఇక్కడ గమనించ వలసిన విషయం ఏమిటంటే అమెరికాలో ఒక ఆచారం ఉంది. నిండు సభలో ఎవరైతే పెద్ద పెద్ద విరాళాలు వాగ్దానం చేస్తారో వారు ఖచ్చితంగా ఆ రోజు చెక్కు బుక్కులూ, క్రెడిట్ కార్డులూ ఇంట్లో మర్చిపోయి వస్తారు. తీరా ఇంటికెళ్ళాకా పెళ్ళాం గూబ వాయిస్తుంది కాబట్టి ఆ తరవాత అంతే సంగతులు. వారి దగ్గర నుంచి ఆ విరాళం కలెక్ట్ చేసుకోడానికి మన తాతలు దిగి రావాలి. ఉదాహరణకి ఒకానొక మాజీ తానా అధ్యక్షుల వారు ఆ విధంగా ఐదు వేలు ప్రకటించి, తరువాత మర్యాదగా మేము గుర్తి చేస్తే "నీకేమన్నా బాకీ ఉన్నానా?" అని కసిరి కొట్టారు.

ఏమైతేనేం, ఆ రోజు ఆ అమెరికా ఆచారం పాటిస్తూ వాగ్దానం చేసిన వెనువెంటనే నేను చెక్కు రాసి ఇవ్వక పోవుట గమనించి అనేక మంది ముక్కున వేలేసుకుని "ఆ వెధవ బడాయి. వీడు నిజంగా ఇచ్చినప్పుడు కదా, అప్పుడు చూద్దాం " అని గుస గుస లాడుకున్నారు. అది గమనించి నాకు పౌరుషం వచ్చి ఆ రాత్రికి రాత్రే క్రెడిట్ కార్డ్ తో కంప్యూటర్ లో డబ్బు కట్టేసి అందరికీ ఈ మెయిల్ పంపించేసి నా పరువు కాపాడుకున్నాను. ఇప్పుడు మా క్వీన్ విక్టోరియాకి తెలియకుండా ఆ క్రెడిట్ కార్డ్ బిల్లు ఎలా కట్టుకోవాలా అని రిసెర్చ్ చేస్తున్నాను.

నేను ఎడ్వాన్సు గానే డబ్బు కట్టేసాను కాబట్టి అక్కడ మహా సభల రిజిస్ట్రేషన్ కౌంటర్ లో నాకు స్వాగతం పలుకులతో అఖండ గౌరవం జరుగుతుంది సుమా అనుకున్న నా ఊహ దారుణంగా దెబ్బతింది. నాకే కాదు, అనేక మంది ప్రముఖ ఆహ్వానితులు కూడా అక్కడ తమని ఎవరూ గుర్తించి అత్యంత ప్రాధాన్యత కలిగిన "నమోదు సంచీ" –అంటే రిజిస్ట్రేషన్ బేగ్---అందించే వారు లేక ఇబ్బంది పడ్డారు. కూరల సంచీలా ఉండే ఈ మహా సభల సంచీ లో మన పంచ ప్రాణాలూ నిక్షేపించబడి ఉంటాయి. అనగా, మనం "పరివేస దవారం" లోపలికి వెళ్ళడానికి ముంజేతికి కట్టుకునే కాగితం కంకణం, ఫలహారమూ మరియు భోజనం టిక్కెట్లూ. ఇవి లేక పోతే ఎంత డబ్బు కట్టినా, "నేను ఇండియా నుంచి ప్రత్యేకంగా ఆహ్వానించబడిన, నా టిక్కెట్టు కూడా కొనిపెట్ట బడిన, నాకు హోటల్ లో గది కూడా ఇవ్వబడిన పండితుణ్ణి" అని వాపోయినా, ఆ "దవారం" దగ్గర కాపలా ఉండే తాటకీ, శూర్పణఖా, ఘటోత్కచుడూ మనల్ని అడ్డగిస్తారు. ఈ సువిశాల ప్రపంచంలో కేవలం ఈ అమెరికా సెక్యూరిటీ వారే చిరంజీవినీ, మోహన్ బాబునీ, జయ సుధనీ, చార్మీ నీ, నన్నూ, మా క్వీన్ విక్టోరియానీ సరి అయిన రంగు ఉన్న ముంజేతి కంకణం ఉంటేనే సభాప్రాంగణం లోకి వెళ్ళనిస్తారు. ఫుడ్ క్యూపాన్ చూపిస్తేనే అప్పడాలు వడ్డిస్తారు.

ఇక్కడ ఆ రిజిస్ట్రేషన్ కౌంటర్ దగ్గర అప్పటికప్పుడు డబ్బు కట్టే వారికీ, నాలాగ ముందుగానే డబ్బు కట్టిన వారికీ, ఇండియా నుంచి వచ్చిన ప్రత్యేక ఆహ్వానితులకీ, అందరికీ ఒకే ఒక లైన్. దాని కాపలా గా ఇంగ్లీషూ, తెలుగు కూడా తెలియని నలుగురు

మెక్సికన్ సెక్యూరిటీ సిబ్బంది, కౌంటర్ వెనకాల బిల బిల లాడుతూ పాతిక మంది పైగా తానా సిబ్బంది. లైన్ లో గంటన్నర తరువాత .కౌంటర్ దగ్గరకి వెడితే అక్కడి ఆయన నన్ను చూసి, గుర్తు పట్టి, పేరు పెట్టి పలకరించి , "బావున్నారా" అని అడిగి, "యస్ సార్, సక్సెస్, ఈ కంప్యూటర్ లో మీ పేరు ఎక్కించబడి యున్నది. ఉంది. కాస్సేపు ఉండండి. బేగ్ తయారు చేస్తాం " అని లేచి వెనకాల బల్ల దగ్గరకి వెళ్ళి పోయి అక్కడి మరొక పెద్ద బేడ్జీ పెట్టుకున్న సుందరాంగి తో కిచ కిచ లాడడం మొదలు పెట్టాడు. ఆ మాట కొస్తే అక్కడ ఉన్న వాలంటీర్లు అందరూ చక చక పని చేయుటకన్నా కిచ కిచ లాడుటలోనే ఎక్కువ సమయం గడిపారు. ఎంతో ముందుగా నమోదు చేసుకున్న వారి సంచీలూ, ఎంతో ఆర్భాటంగా వెబ్ సైట్ లో ఫోటోలు పెట్టి ఆహ్వానించిన ప్రముఖులకీ ఈ చిన్న సైజు గోనె సంచీలు ముందుగానే తయారు చేసుకుని రెడీ గా ఎందుకు ఉంచుకోరో నాకు గత ముప్ఫై ఏళ్లగా అర్థం అవడం లేదు ఇప్పటి దాకా నేను వెళ్ళిన సుమారు పాతిక మహా సభలలోనూ రిజిస్ట్రేషన్ సమయంలో ఇదే తంతు.

తీరా ఎంతో ఆత్రంగా ఆ సంచీ తెరిచి చూస్తే "నాగరికుల విందులో ఉండ వలసిన అసలు వంటకం" ...అంటే ఈ మహా సభల కార్యక్రమ వివరాలు లేనే లేవు. ఒకానొక పెద్ద బేడ్జీ గారిని అడిగితే "ఏమో సార్ , ఆ కమిటీ వారిని అడగండి, నేను ఆధ్యాత్మికం వాడిని" అనేసి హిమాలయాలకేసి పారిపోయాడు. ప్రోగ్రాం షీట్ లేకుండా ఏ గదిలో ఏయే కార్యక్రమాలు ఎన్ని గంటలకి జరుగుతాయో, ఏ గదిలోకి నా బోటి వాడు అడుగుపెడితే కొంప ములుగుతుందో ఎలా తెలుస్తుంది? అలా అని ప్రతీ గది ముందూ ఆ వివరాలు పెట్టారా అంటే, అదీ లేదు. అందు వలన మేం అందరం గుడ్డెద్దు చేలో పడ్డట్టుగా అన్ని గదులలోకీ వెళ్లి అక్కడ ఉన్న నిర్వాహకులని అడిగి నేను, నాతో బాటు తనికెళ్ళ భరణీ, జొన్నవిత్తుల గారూ, అక్కిరాజు సోదరులు రమాపతి రావు గారూ, సుందర రామకృష్ణ గారూ నానా తంటాలూ పడ్డాం.

ఇక ముందు రోజు ఘనత వహించిన బేంక్వెట్ రాత్రి. నిజానికి దాన్ని "అర్థ రాత్రి అంకమ్మ శివాలు" అని అనాలి. ఈ బేంక్వెట్ లు కూడా ఎప్పుడూ అధ్వాన్నంగానే ఉండుటయే కాక , ఈ సంబరానికే వేరే టిక్కెట్టు కూడా ఉంటుంది. ఈ సారి తమాషా ఏమిటంటే రెండు గంటలు ఆలస్యంగా రాత్రి తొమ్మిది గంటలకి సంబరాలు మొదలుపెట్టగానే ఆదిలోనే హంసపాదు ఎదురయింది. సుమారు పది మంది యువతీ యువకులు రక రకాల వాయిద్యాలు పట్టుకుని "వేదిక నేల" మీద ఆసీనులయ్యారు. క్రింద ముందు వరస లో ఖరీదుగా కనపడే బల్లల చుట్టూ ముఖమల్ గుడ్డలు కట్టిన కుర్చీలలో చిరంజీవి, ఎస్ పీ బాలూ, జయ సుధ, మన భారత రాయబారి శ్రీమతి నిరుపమా రావు గారు, హ్యూస్టన్లో ఉండే తెలుగు వారైన మన భారత దౌత్యాధికారి హరీష్ గారు, కెనడాలో భారత సాంస్కృతిక రాయబారి యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మొదలైన హేమాహేమీలు కొలువుతీరారు. గొల్లపూడి గారూ, జొన్నవిత్తుల గారూ మొదలైన ప్రముఖుల మధ్య దిష్టి పిడత అవతారంలో నేనూ కాస్త "అసింటా" కూచున్నాం. ఇప్పుడు మన పవిత్ర జాతీయ గీతంతో ఈ బేంక్వెట్టు ప్రారంభం అవుతుంది " అని మొ. పా. యాం. ..అంటే మొదటి పాట్టి యాంకరమ్మ ప్రకటించగానే ఠకీమని కొందరూ, అనకుండా కొంచెం కష్టపడి ఇతరులూ లేచి నిలబడ్డాం. అప్పుడు వెనకాల ఎక్కడో సౌండు సిస్టం టేప్ లోనుంచి "జన గణ మన" వినపడడం, దానికి అనుగుణంగా వేదిక నేల మీద కూచుని ఉన్న వాయిద్యకారులు ఊపుతూ, ఊగుతూ నటించడం మొదలుపెట్టారు.

ఈ వింత కి మేము అచ్చెరువు పొందుతూ ఆ వెనకాల నుంచి వస్తున్నా ఆ నేపధ్య గానం హఠాత్తుగా ఆగిపోయింది. పాపం వాయిద్యం గాళ్ళు కాస్సేపు వెనక్కి, వెనక్కి చూస్తూ వాయించడం, ఆపడం, కానీ ఆ టేపు మొరాయించడంతో ఇంక ఏమీ చెయ్య లేక నిస్సహాయంగా మన జాతీయ గీతం మధ్యలో ఆపేశారు. అంతా ఘోరమైన నిశ్శబ్దం. టేపు మళ్లీ వచ్చునా, వీళ్ళు మళ్లీ ఎక్కడ వదిలేసిన వాయిద్యాన్ని అక్కడ నుంచి మొదలుపెట్ట గలరా లేదా అనే హిచ్ కాక్ సస్పెన్స్. మూడు, నాలుగు నిముషాల తరవాత ఈ సస్పెన్స్ భరించ లేక మా కాన్సల్ జనరల్ గారు పెద్ద పులి వలె లంఘించి "జాతీయ గీతాన్ని మధ్యలో ఆపేయడం క్షమించరాని నేరం" అని ప్రకటించగానే దజన్ల కొద్దీ నిర్వాహకులు ఏం చెయ్యాలో తెల్ల మొహాలు వేసుకుని చూస్తూ ఉంటే, ఆపద్బాంధవుడిలా శ్రీపతి పండితారాధ్యుల బాల సుబ్రహ్మణ్యం గారు దిగ్గజం లా లేచి, వేదిక మీదకి లంఘించి ఎంతో శ్రావ్యంగా జన గణ మన పాడి రెండు దేశాల పరువూ కాపాడారు.

ఇక ఆ మర్నాడు ప్రారంభ సభ నుంచి రెండోనాడు ముగింపు సభ దాకా ప్రధాన వేదిక మీద జరిగిన కొన్ని వేడుకలు చూస్తే నాకు కనపడినదల్లా క.కా. కుల భజనే. ఇతర "అమెరికాకులం" వారందరూ ఆటలో అరటి పండ్లే! అందరూ రాజకీయ నాయకులూ, టీవీ వారూ, అస్మదీయ వర్గాలే! ఎక్కడా ఒక్క కళాకారులు కాని, సాంస్కృతికవేత్తలు కాని, కవులు కాని, ఆఖరికి కాషాయ వస్త్రాలు కానీ లేరు. మొదటి రోజు ఒక రోజు "కా" కుల నాయకుల వారి భజన చేస్తే, రెండో రోజు "క" కులం వారి నాయకులకి కాకా పట్టారు అని స్పష్టంగానే తెలిసింది.

ఈ సర్కస్ లో కావాల్సిన "బేలన్సింగ్ ఏక్ట్" బాగానే చేసారు. అందు కోసం ప్రారంభ సభలోఒక కొత్త టెక్నిక్ ప్రవేశపెట్టారు ఈ సారి. అదేమిటంటే వేదిక మీద పాతిక కుర్చీలు వేసారు. ఒకరిద్దరికి తప్ప ఆ కుర్చీలలో ఆశీనులు కావడానికి అర్హతలు అప్పటికప్పుడే లాటరీ పద్ధతిలో నిర్ణయించారు. ఉదాహరణకి మొ. పా. యాం. ..అంటే మొదటి పొట్టి యాంకరమ్మ ఎప్పుడు చిరంజీవిని పిలుద్దామా అనే తపనలోనే ఉండి, మొదటి వరసలో కూచున్న చిరంజీవి నుంచి దృష్టి మళ్లిస్తే ఒట్టు. ఇది నాకేలా తెలుసూ అంటే, చిరంజీవి కుర్చీకి పక్కన నాలుగో కుర్చీలో నేనూ, నా పక్కన జొన్నవిత్తుల గారూ, గొల్లపూడి గారూ కూచున్నాం. ఆ తపనలో ఆ మొ. పా. యాం "ఇప్పుడు వేదిక మీద ఉన్న పన్నెండో కుర్చీలో కూచో వలసినదిగా గొలగాబత్తుల స్వామి నాయుడు గారిని సాదరంగా ఆహ్వానిస్తున్నాను. ఆయన గైగోలుపాడు గ్రామ పంచాయతీ మాజీ చైర్మన్ ..పదేళ్ళ కిందట". అని ఆహ్వానించింది. ఇది ఏ మాత్రమూ ఊహించని గొలగాబత్తుల వారు ఆరో వరస లోంచి పరిగెత్తుకొచ్చి పన్నెండో కుర్చీలో రొప్పుతూ చతికిల పడ్డారు. "చా...దాని దుంప తెగ, ముందే తెలిస్తే సిల్కు పంచ కట్టుకునే వోణ్ణి కదా. ఈ ఎదవ కాటన్ సెడ్డీ లో చిరంజీవి ముందు కూకోబెట్టారు" అని ఆయన వాపోడం నేను లంచ్ టైం లో విన్నాను. అల్లుడ్ని చూడ్డానికి వచ్చిన ఇటువంటి అనామక మాజీ గ్రామ పంచాయతీ చైర్మన్ అమెరికాలో తానా మహాసభల ప్రారంభ వేదిక మీద కూచోడం లాటరీ కాక మరేమిటి చెప్పండి.

ఇక చిరంజీవిని ఆహ్వానించే తరుణం ఆసన్నం అయినపుడు ఆ మొ. పా. యాం "అబ్బనీ తియ్యనీ దెబ్బ" టైపులో మహా ఓవర్ ఏక్షన్ చేసెయ్యడమే కాకుండా ఆయన వేదిక మీదకి వచ్చినప్పుడు సాక్షాత్తూ ఆయన తన సొంత ఇంటికే వస్తున్న

ఫీలింగుతో "రండి, రండి, మా ఇంటికి మీ రాక మా కెంతో మహానందం అండీ " అని పాడుతూ అష్ట వంకరులూ తిరిగిపోయి పది వేల మంది అమెరికా తెలుగు వారు చిరంజీవికి కొట్టిన చప్పట్లు తనకే అనుకుని మురిసిపోయింది. ఆ పాతిక కుర్చీలూ నిండిపోయాక ఇక ప్రసంగాలు మొదలయ్యాయి. దీనికి సెకండరీ లాటరీ పద్ధతి అమలులోకి వచ్చింది. అంటే వేదిక మీద మొదటి లాటరీలో నెగ్గి కూచున్న వారిలో రెండో లాటరీలో నెగ్గిన వారికి ప్రసంగించే అవకాశం ఇద్దామని నిర్వాహకులు బహుశా నిర్ణయించుకున్నారు. ఇక్కడ కూడా మరొక వినూత్నమైనపద్ధతి ప్రవేశపెట్టబడింది. అదేమిటంటే గైగోలుపాడు గొలగాబత్తుల వారు ప్రసంగించగానే వారు గొప్పగా వెనక్కి వెళ్లి పన్నెండో కుర్చీలో కూచుని కాలర్ ఎత్తుకోడానికి లేకుండా వెంటనే వేదిక దిగిపోవాలి. ఇలా వేదిక మీద నాలుగైదు కుర్చీలు ఖాళీ అవగానే మళ్లీ మొదటి టైపు లాటరీ తీసి, మరొక నలుగురిని వేదిక మీదకి పిలుస్తారన్నమాట. ఈ టెక్నిక్ లో అద్భుతమైన ఫలితం ఏమిటంటే, రెండు గంటల కార్యక్రమంలో, వేదిక మీద ఉన్న పాతిక కుర్చీలని వంద మంది కాస్సేపు కుర్చీ వేడి అయ్యే దాకా కూర్చుని, ఆ ఫోటో ఇండియాలో పేపర్లో వేయించేసుకోవచ్చును. టీవీలలో కనపడనూ వచ్చును. వారి అర్హతలు ఏమిటో దేముడి కే తెలియాలి కానీ ఉత్తర అమెరికాలో తానా మహా సభల ప్రారంభ వేదిక మీద పాల్గొనే అపురూపమైన అవకాశం దక్కించుకున్న ఈ అనామకుల్ని అభినందించాలి.

అన్నట్టు, చెప్పడం మర్చిపోయాను...స్టేజ్ మీద కుర్చీలూ, ప్రసంగావకాశాలూ లాటరీ పద్ధతిలో నిండుతున్నాయి అని మొదటి రెండు, మూడు వరసలలో కూచున్న నా బోటి వాళ్ళకి తెలిసిపోయాక అప్పటికప్పుడే అర్జంటుగా "తరువాత ఆ యాంకరమ్మ ఎవరిని వరిస్తుందీ" అనే అంశం మీద బెట్టింగ్ లు, ఆశలూ, నిరాశలూ చోటుచేసుకున్నాయి. నేను ఆ అమ్మాయి కేసి ఎన్ని సార్లు చేతులూ, కాళ్ళూ , డాలర్లూ వగైరా ఊపుతూ తంటాలు పడినా ఉపయోగం లేకపోయింది.

అన్నింటికన్నా హాస్యాస్పదం ఏమిటంటే ఈ మహాసభల ప్రారంభ నృత్య రూపకం ఐదు తరవాత ఆరో అంశంగా ప్రారంభ సభ పూర్తిగా అయిపోయాక చిరంజీవి తో సహా అన్ని కుర్చీలూ ఖాళీ అయిపోయాక, ప్రేక్షకులందరూ మధ్యాహ్నం భోజనాలకి వెళ్ళిపోయాక ప్రదర్శించబడింది. అది మొదలు పెట్టినప్పుడు అప్పుడు ఆ గీత రచయిత జొన్నవిత్తుల గారూ, నేనూ, ఆ గేయాన్ని దగ్గిరుండి స్వయంగా వ్రాయించుకున్న తానా అధ్యక్షులు శ్రీ తోటకూర ప్రసాద్ గారూ, మరొక పాతిక మంది మాత్రమే హాలులో ఉన్నాం. కానీ ఆ ప్రారంభం నృత్యం 45 నిముషాల సేపు అద్వితీయంగా జరిగింది కాబట్టి, చివరాఖరికి రెండు వేల మంది వచ్చి చూశారు.

ఇక రెండో రోజు రెం.పో.యాం...అనగా రెండో పొట్టి యాంకరమ్మ మొ.పో.యాం. పెర్ఫార్మెన్స్ చూసి రెచ్చిపోయింది. ఈవిడ కేండి డేటు ఒకప్పుడు "కా" వర్గానికి..అనగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేసి, తరువాత "అన్న" గారికి తెలుగు దేశంలో తమ్ముడి పాత్ర వహించి ఇప్పుడు మళ్లీ సినిమాలలోకి తిరిగి వెళ్లి పోయిన "కాక"లు తీరిన నటుడు మోహన్ బాబు. అనేక మంది అభిమానుల అరుపులతో, కేకలతో చుట్టూ సెక్యూరిటీ సిబ్బందితో అంగరంగ వైభవంగా మోహన్ బాబూ, జయసుధ, బ్రహ్మానందం కేవలం హర్షధ్వానాల మధ్య తానా ప్రధాన ప్రాంగణ ప్రవేశం చేసారు. ఈ సారి ఎవరినీ వేదిక మీద కూచోపెట్టకుండా కేవలం తానా నాయకులే వేదిక ఈ మూల నుండి ఆ మూల దాకా బారులు తీరి నిల్చుని ఒక్కొక్కరికీ విడిగా సన్మానాలు చేసారు. మోహన్ బాబు తన తానా

ప్రసంగంలో తాను ఇది వరలో చాలా మందిని తన్ని నట్టూ, తన్నులు తిన్నట్టు వివరించి, అయినా తాను ఏ నాడు ఎవరికీ భయపడ లేదనీ, దమ్ముంటే కాచుకోండి అనీ రొమ్ము చరుచుకుని అందర్నీ భయపెట్టారు. మరొకాయన “ఆ నాడు గాంధీ గారు లుంగీ కట్టారు, పీవీ గారు తెల్ల పంచె కట్టారు, ఎన్టీఆర్ రంగు రంగుల పంచెలు కట్టారు, ఇక చిరంజీవి గారైతే పంచె కట్టడమే కాకుండా పంచె ఊడగొట్టి తరిమికొడతాను అన్నారు” అనేసి పంచె కట్టుడు మీద, విప్పుడు మీద ఆవేశపడి మాట్లాడుతూ, సదరు మెగా స్టార్ పార్టీ మారిపోయి “క”వర్గ నాయకుడిగా “కా” ..అనగా కాంగ్రెస్ లోకి వచ్చేసారని హఠాత్తుగా గుర్తుకొచ్చి బాత్రూమ్ కేసి పరిగెట్టారు...అవును...అందుకే!

మొత్తానికి ఈ 19 తానా మహా సభలు బాగానే జరిగినా “ఆపరేషన్ సక్సెస్ ఫుల్ బట్ పేషెంట్ డైడ్” అనే రీతిలో జరిగాయి అనిపించింది. ఎందుకంటే ఆపరేషన్ చేసిన సర్జన్ గా తానా అధ్యక్షులు శ్రీ తోటకూర ప్రసాద్ గారు ఎంతో సమర్ధుడు. కానీ ఈ సారి ఎందుకో ఆయన చుట్టూ ఉన్న సహాయక బృందంలో కొందరు ....అంటే నర్సులు సరిగ్గా సహకరించ లేదేమో అని నా వ్యక్తిగత అభిప్రాయం.

మా బ్లాగ్: www.vangurifoundation.blogspot.com

COMMENTS